
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి

5

మెదక్

జిల్లాల వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025

విద్యార్థులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన..

నిలదీయడంతో విధులకు డుమ్మా

చేగుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో అసభ్యంగా మాట్లాడడం, తీవ్రంగా దండించడం చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు నిలదీయడంతో ఇరవై రోజులుగా పాఠశాలకు రావడం లేదు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి... మెదక్ జిల్లా చేగుంట మండలం కరీంనగర్ ప్రాథమిక పాఠశాలలో పూర్ణచందర్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న విషయాలకే విద్యార్థినీ విద్యార్థులను బూతులు తిడుతూ, పనిష్మెంట్లు ఇస్తున్నారు. పిల్లలను ఒకరిచే మరొకరిని కొట్టిస్తున్నారు. రోజూ ఇదే విధంగా ప్రవర్తించడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు విషయం తెలిపారు. దీంతో ఈ నెల 11 తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. వారు మాట్లాడుతుండగానే జారుకున్న ఉపాధ్యాయుడు ఇప్పటి వరకు పాఠశాలకు హాజరు కాలేదు. ఈ విషయంపై ఎంఈవో నీరజను వివరణ కోరగా గ్రామస్థులు ఫిర్యాదు మేరకు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడినట్లు తెలిపారు. పూర్ణచందర్ అసభ్యంగా తిడుతున్నారని, చీటీకీమాటికి కొడుతున్నారని, ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థులు చెప్పారన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారికి నివేదించినట్లు ఎంఈవో తెలిపారు.



లింకు ఓపెన్ చేస్తే..

రూ.లక్ష మాయం

సైబర్ నేరగాళ్ల చేతివాటం

అమెజాన్‌లో షాపింగ్ చేసినట్లు

క్రెడిట్ కార్డు నుంచి డబ్బు కట్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అపరిచితుడి నుంచి మొబైల్ ద్వారా వచ్చిన లింకు ఓపెన్ చేసిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.1.10 పోగొట్టుకున్న సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న నవీన్‌కుమార్ సంగారెడ్డి పట్టణ సమీపంలోని పెప్సీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన ఫోన్‌కు ఆదివారం ఓ కొత్త నంబర్ నుంచి లింకు వచ్చింది. దాన్ని ఓపెన్ చేయగా అమెజాన్‌లో షాపింగ్ చేసినట్లు పేర్కొంటూ తన హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు నుంచి రూ.1,10,905 కట్ అయ్యాయి. తాను షాపింగ్ చేయకుండానే డబ్బులు కట్‌కావడంతో బాధితుడు సైబర్‌క్రైం విభాగానికి ఫిర్యాదు చేశాడు.

నిమజ్జనం వేళ.. పైలం

నిండుకుండల్లా జలాశయాలు

భారీ వర్షాలకు బలహీన పడిన చెరువు కట్టలు

చిన్న పొరపాటు పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం

భక్తి ఉత్సాహం.. భద్రతా సవాళ్ల మధ్య నిమజ్జనాలకు ఏర్పాట్లు

అధికార యంత్రాంగం అప్రమత్తం

పకడ్బందీగా ఏర్పాట్లు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మెదక్ జిల్లాలోని చెరువులు, వాగులు, జలాశయాలు నిండుగా ఉన్నాయి. చెరువుల కట్టలు తడిసి బలహీనపడటంతో అధికారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2,640 చెరువుల్లో నీరు పూర్తిగా నిండింది. 63 చెరువులకు గండ్లు పడ్డాయి. ఈ పరిస్థితుల్లో గణేశ్ నిమజ్జనాలు జరగడం సవాల్‌గా మారింది.

మెదక్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం సుమారు మూడు వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. చిన్న విగ్రహాల నుంచి భారీ మూర్తుల వరకు ప్రతిష్ఠించారు. నిమజ్జనం సమయంలో తోపులాటలు జరిగే ప్రమాదం ఉందని, ఒకేసారి ఎక్కువ విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల గందరగోళం ఏర్పడవచ్చని అధికారులు భయపడుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలు ఇంకా ప్రజల మదిలో ఉన్నాయి.

అధికారులు అప్రమత్తం

ప్రమాదాలను నివారించడానికి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సిద్ధమయ్యాయి. చెరువుల వద్ద బారికేడ్లు, లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా నీటిలో మునిగిపోతే గాలించడానికి ప్రత్యేకంగా గజ ఈతగాళ్లను నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమజ్జనంలో పాల్గొనే యువకులు మద్యం సేవించకుండా చూడాలని, గ్రామాల్లో వలంటీర్ల

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి జిల్లా వైద్యశాఖలో

ఎట్టకేలకు సెలక్షన్ జాబితా

10 కేటగిరీల్లో పోస్టులకు ఎంపిక ప్రక్రియ పూర్తి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల భర్తీకి ప్రొవిజనల్ మెరిట్ జాబితాతో పాటు సెలక్షన్ జాబితాను శనివారం రాత్రి విడుదల చేశారు. కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో 10 కేటగిరీల పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాతో పాటు సెలక్షన్ జాబితాను పొందుపర్చారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 17 కేటగిరీల్లో 117 ఖాళీల భర్తీకి ఏప్రిల్ 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఒకే పోస్టు ఉన్న 10 కేటగిరీల పోస్టులకు మాత్రమే ప్రస్తుతం సెలక్షన్ జాబితా విడుదల చేశారు. వాటిలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, పీడియాట్రిక్స్, ఫిజిషియన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, టీబీహెచ్‌వీ, అనస్థీషియా, బయోకెమిస్ట్, సీటీ రేడియోగ్రాఫర్ పోస్టులున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామకపత్రాలు అందజేసి పోస్టింగులు ఇస్తామని డీఎంహెచ్‌వో నాగనిర్మల తెలిపారు. మిగిలిన పోస్టులను కూడా త్వరలో భర్తీ చేస్తామని ఆమె తెలిపారు.

నాలుగు నెలల ఉత్కంఠకు తెర

వైద్య ఆరోగ్యశాఖలో గతేడాది 97 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ వివిధ కారణాలతో నియామకాలు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 29న వివిధ కేటగిరీల్లో 117 పోస్టులను భర్తీ చేసేందుకు కొత్త నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొవిజనల్ జాబితా విడుదల చేసి మూడు నెలలైనా మెరిట్, సెలక్షన్ జాబితా ప్రకటనలో విపరీతమైన జాప్యం జరగడంతో అనుమానాలు నెలకొన్నాయి. ఈ నోటిఫికేషన్ కూడా భర్తీ చేస్తారా.. లేక పక్కన పెడుతారా అని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 'మెరిట్ జాబితా ఏదీ?' అనే శీర్షికన గత నెల 29న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించి నియామక ప్రక్రియలో వేగం పెంచారు. ఎట్టకేలకు పది పోస్టులకు సంబంధించి సెలక్షన్ జాబితాను శనివారం రాత్రి ప్రకటించారు. దీంతో అభ్యర్థుల ఉత్కంఠకు తెరపడినట్టైంది.

కోలుకుంటున్న మెతుకుసీమ

● మెదక్ జిల్లాలో వరద విధ్వంసం ● కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు



రామాయంపేట-సిద్దిపేట రహదారిపై కల్వర్టు మరమ్మతులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్/రామాయంపేట/హవేలిఘణపూర్/మెదక్ మున్సిపాలిటీ/ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాను కుదిపేసిన భారీ వర్షాలు, వరదలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. అనేక గ్రామాల్లో వరద నష్టం, ఇళ్ల కూలిపోవడం, రహదారుల దెబ్బతినడం వంటి తీవ్ర పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ప్రకృతి బీభత్సానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తుండగా, ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ఈ పెను విపత్తులోనూ మానవత్వం, అధికారుల నిర్లక్ష్యం రెండూ బయటపడ్డాయి.

సాధారణ స్థితికి హవేళీఘణపూర్

భారీ వరదల తాకిడికి దెబ్బతిన్న హవేళీఘణపూర్ మండలంలో వరద ప్రభావిత గ్రామాలు నెమ్మదిగా తేరుకుంటున్నాయి. దెబ్బతిన్న రోడ్లను మట్టితో తాత్కాలికంగా పూడ్చి రాకపోకలు పునరుద్ధరించారు. మండలంలో 261 ఇళ్లు దెబ్బతినగా, 5వేల ఎకరాల పంట నష్టం వాటిల్లింది. 11 చెరువుల కట్టలు తెగిపోయాయి. అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

కూలిన ఇల్లు.. ఆస్పత్రిలోనే నివాసం

హవేళీఘణపూర్ మండలం తిమ్మాయిపల్లిలో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో మంగలి చంద్రయ్య కుటుంబం నిరాశ్రయులైంది. నిలువ నీడ లేక గ్రామంలో నిర్మిస్తున్న పల్లె దవాఖానాలో తలదాచుకుంటున్నారు. కిటికీలు, తలుపులు లేని ఆ గదుల్లో రాత్రివేళ చలికి వణుకుతున్నారు. ఎవరైనా ఆహారం ఇస్తే తింటున్నారు. వారి దీనస్థితిని చూసి గ్రామస్థులు చేతనైన సహాయం చేస్తున్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పొలాలను ముంచెత్తిన మున్సిపల్ చెత్త

మెదక్ మున్సిపాలిటీకి వరదలు ఒకరకంగా మేలు చేశాయని చెప్పాలి. భారీ వర్షాలకు మున్సిపల్ డంపింగ్ యార్డులోని గోడ కూలిపోవడంతో అక్కడి చెత్త అంతా పక్కనే ఉన్న వాగులోకి, పంట పొలాల్లోకి కొట్టుకుపోయింది. దీనివల్ల డంపింగ్ యార్డు సగం ఖాళీ అవ్వడంతో అధికారులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఇది వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమిలో కరగని ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా పొలాల్లోకి చేరితే నీటితో కలిసి మరింత కాలుష్యానికి దారితీస్తాయని పేర్కొంటున్నారు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ సూచనలు, నష్టం అంచనా

జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ప్రమాదకరమైన వంతెనలను దాటే సాహసం చేయవద్దని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఆయన పర్యటించి, వరదలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. 11 మండలాల్లో వరద నష్టం జరిగిందని, 130 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.



రోడ్డు దాటడానికి సాహసం

హవేళీఘణపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెదక్-బోధన్ హైవే కొట్టుకుపోవడంతో సరిహద్దు గ్రామాల ప్రజలు అటు, ఇటు వెళ్లడానికి సాహసం చేయాల్సి వస్తున్నది. మండలంలోని పోచమ్మరాల్ గ్రామ శివారులో వరద ప్రవాహం తగ్గడంతో హైవేపై బ్రిడ్జి పైకి తేలింది. నాలుగు రోజులుగా సరిహద్దు గ్రామాల్లో చిక్కుకున్న వారు సొంతూళ్లకు వెళ్లేందుకు మొగ్గుచూపారు. వంతెనకు చేరుకునే రోడ్డు రెండువైపులా పూర్తిగా కొట్టుకుపోవడంతో వాగు నీళ్లలో నుంచి వంతెన చివరకు నడుచుకుంటూ వచ్చి, అక్కడ తాళ్ల సాయంతో పైకెక్కి అవతల వైపు వెళ్లారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలన్నా రెండు రోజులు పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



తెరుచుకున్న సింగూరు ప్రాజెక్టు గేట్లు

సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి

76,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

ఏడు గేట్లను తెరిచి నీటి విడుదల

కొన్యాల వంతెన పైనుంచి ప్రవాహం

చౌటకూర్-హత్నూర మండలాల మధ్య నిలిచిన రాకపోకలు



కొన్యాల వద్ద వంతెన పైనుంచి ప్రవహిస్తున్న మంజీరా నది

పుల్‌కల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మంజీర నదికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతున్నది. సింగూరు ప్రాజెక్టుగా భారీగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా వరద రావడంతో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి 76,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు ఏడు గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. దీంతో 76,088 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదవుతున్నది. దిగువన మంజీర జలాశయం వద్ద కూడా ఆరు గేట్లు ఎత్తి నీటిని వదులుతుండటంతో మంజీర నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. చౌటకూర్ సమీపంలో కొన్యాల వద్ద నదిపై నిర్మించిన వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తున్నది. దీంతో చౌటకూర్, అందోలు-హత్నూర మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మంజీర పరీవాహక ప్రాంతాల్లో పంటలన్నీ నీట మునిగాయి.

పరీవాహక ప్రాంత రైతుల పాట్లు

చిలప్‌చెడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మంజీర నది ప్రవాహం పెరగడంతో చిలప్‌చెడ్ మండలంలోని పలు గ్రామాల్లో నది ఒడ్డున ఉన్న పొలాలు నీట మునిగిపోయాయి. దీంతో రైతులు తమ పొలాలకు నీటిని పారించేందుకు నదిలో ఏర్పాటు చేసుకున్న మోటర్లు, స్టార్టర్లను వెలికితీసి భద్రపర్చుకుంటున్నారు. ఇందుకోసం వరద ప్రవాహంలోనే సాహసం చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా...

పుల్‌కల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదమని తెలిసినా పర్యాటకులు నది వద్దకు వెళ్లి మరీ ఫొటోలు తీస్తున్నారు. ఆదివారం సింగూరు ప్రాజెక్టును తిలకించేందు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కొందరు జలవిద్యుత్ కేంద్రం గోడ పైకెక్కి ఒకటో నంబరు గేట్ వరకు వెళ్లి మరీ సెల్ ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.



జలవిద్యుత్ కేంద్రం గోడ పైకెక్కి వరద ప్రవాహం ఫొటోలు తీస్తున్న పర్యాటకులు

ప్రీ ప్రైమరీ బడుల్లో

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు నేటి నుంచి దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొత్తగా మంజూరైన 59 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభానికి సర్కారు అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు డీఈవో వెంకటేశ్వర్లు నోటిఫికేషన్ విడుదల చేశారు. నేటి నుంచి 8వ తేదీ వరకు మండల కేంద్రాల్లోని ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 11వ తేదీ నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారు. అభ్యర్థులు 18-44 ఏళ్ల వయసులో ఉండాలని, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్, ఆయా పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8 వేలు, ఆయాకు నెలకు రూ.6 వేల గౌరవ వేతనం చెల్లించనున్నారు. మండల కమిటీల ద్వారా స్థానిక అభ్యర్థులనే ఎంపిక చేస్తామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

అర్ధరాత్రి త్రీఫేజ్ కరెంటా?

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



కడ్పల్‌లో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కల్హేర్/సిర్గాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్‌ను రాత్రి వేళల్లో సరఫరా చేయడంపై రైతులు మండిపడ్డారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం 33/11కేవీ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఎనిమిది రోజులుగా త్రీఫేజ్ కరెంటు సక్రమంగా సరఫరా జరగడం లేదని రైతులు పేర్కొన్నారు. గతంలో వ్యవసాయానికి పగటి పూటనే 18 గంటల త్రీఫేజ్ కరెంటు సరఫరా చేశారని, ఇప్పుడు వేళలు మార్చడమే కాకుండా కేవలం 14 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి సరఫరాలో పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లి ప్రమాదాల బారినపడితే ఎవరు బాధ్యులని ఆపరేటర్లను నిలదీశారు. ఇంతకుముందు మాదిరిగానే పగటి పూట త్రీఫేజ్ కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పగటిపూట కరెంటు లేకపోవడంతో గ్రామంలో తాగునీటి సరఫరా కూడా నిలిచిపోయిందని వాపోయారు.

నేనింతే.. నచ్చకుంటే బదిలీ చేయించండి

ట్రాన్స్‌కో లైన్‌మన్ బరితెగింపు

ఉన్నతాధికారుల విచారణలోనే తేల్చిచెప్పినా చర్యలు శూన్యం 6

బస్సులో మరిచిన బ్యాగు అప్పగింత

12.5 తులాల బంగారం, రూ.50వేల నగదు సురక్షితం 6

మూసివేత దిశగా..!

నిరుపయోగంగా రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ 7

వైద్యశాఖలో ఎఫ్ఆర్ఎస్.. తుస్

అమలుకు నోచుకోని నూతన హాజరు విధానం

ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రెండు రోజులకే స్వస్తి



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖలో ఆధార్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలుకు బ్రేక్ పడింది. గత నెల 5వ తేదీన కొత్త విధానం అమలులోకి తెచ్చినా.. రెండు రోజులకే స్వస్తి పలికారు. ఫలితంగా టీవీవీపీ సర్కారు దవాఖానాలతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది, ఉద్యోగుల హాజరుపై పర్యవేక్షణ కొరవడింది.

డీఎంహెచ్‌వో పరిధిలో 2వేల మంది

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), 4 యూపీహెచ్‌సీలు, 19 బస్తీ దవాఖానాలు, 70 పల్లెదవాఖానాలు, 176 సబ్‌సెంటర్లు(ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు), 36 ఆయూష్ డిస్పెన్సరీలు, ఓ పాలియేటివ్ కేర్, రెండు డయాగ్నోస్టిక్ హబ్‌లు, డీఈఐసీ, 7 ఎన్‌సీడీ క్లినిక్‌లు ఉన్నాయి. వాటిల్లో రెగ్యులర్, కాంట్రాక్టు డాక్టర్లు, వైద్య సిబ్బంది కలిపి 2వేల మంది వరకు పనిచేస్తున్నారు. ఆయా వాటిల్లో చాలామంది వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలున్నాయి. ఆశా కార్యకర్త నుంచి మెడికల్ ఆఫీసర్ వరకు అన్నిస్థాయిల వైద్య ఉద్యోగులకు ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అమలుకు నోచుకోలేదు.

టీవీవీపీ పరిధిలోనూ అదే తంతూ

జిల్లాలోని టీవీవీపీ పరిధిలో నాలుగు ఏరియా ఆస్పత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లున్నాయి. వీటి పరిధిలోనూ సుమారు 600 మంది వైద్య సిబ్బంది పని చేస్తున్నారు. అయితే ఈ నెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సదాశివపేట సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈక్రమంలో ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విధుల డుమ్మా కొట్టిన ఏడుగురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సిబ్బంది హాజరును పర్యవేక్షించడానికి తక్షణమే ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇది జరిగి 20 రోజులు అవుతున్నా ఇప్పటివరకు అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు.

ఉన్నతాధికారులు దృష్టిసారించేనా?

జిల్లాలోని అన్ని సర్కారు దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది విధులు ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలున్నాయి. దీనికి చెక్ పెట్టాలంటే ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చేయాల్సిన అవసరం ఉంది. టీవీవీపీ, డీఎంహెచ్‌వో పరిధిలోని పలు విభాగాల కార్యాలయాల ఉద్యోగులకు సైతం ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చేస్తే పరిస్థితి మెరుగుపడుతుంది. ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే పరిస్థితి మెరుగుపడుతుంది. దీనిపై కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నేనింతే.. నచ్చకుంటే బదిలీ చేయించండి

● ఉన్నతాధికారుల ముందే ట్రాన్స్‌కో లైన్‌మన్ బరితెగింపు



అల్లాదుర్గం ట్రాన్స్‌కో కార్యాలయంలో విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు

అల్లాదుర్గం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మన్ రమేష్‌పై అల్లాదుర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణకు వచ్చిన అధికారుల ముందే నా పనితీరు ఇలాగే ఉంటుంది, నచ్చకపోతే మరో ప్రాంతానికి బదిలీ చేయండి అని రమేష్ అనడం గమనార్హం. రమేష్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని, ఉద్యోగం చేసే చోట కాకుండా 25 కిలోమీటర్ల దూరంలోని తన స్వగ్రామంలో ఉంటున్నాడని స్థానికులు ఆరోపించారు. ఇటీవల విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు గంటన్నర ఆలస్యంగా వచ్చారని, దీంతో ఉన్నతాధికారులు రమేష్‌కు సంబంధించిన ఒక రోజు వేతనాన్ని నిలిపివేశారని తెలిపారు. దీనిపై గ్రామస్థులు మరోసారి ఫిర్యాదు చేయగా, శనివారం అధికారులు విచారణ చేపట్టారు. రమేష్ నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తప్పని యూరియా కష్టాలు



చిన్నశంకరంపేట : జంగరాయి సహకార సంఘం వద్ద మహిళా రైతుల పడిగాపులు

చిన్నశంకరంపేట/ వెల్దుర్తి/ శివ్వంపేట/జోగిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆదివారం కూడా పలుచోట్ల అన్నదాతలు పడిగాపులు పడ్డారు. చిన్నశంకరంపేట, వెల్దుర్తి, జోగిపేట మండలాల్లో రైతులు బారులు తీరారు. పోలీసుల బందోబస్తు మధ్య యూరియాను విక్రయించారు. కొందరు యూరియా లభించని రైతులు నిరాశతో వెనుదిరిగారు. శివ్వంపేటలో యూరియా రావడం ఆలస్యం కావడంతో తూప్రాన్-నర్సాపూర్ జాతీయ రహదారిపై శివ్వంపేటలో రైతులు సుమారు గంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.



వెల్దుర్తి రైతు వేదిక వద్ద చెప్పుల క్యూ



కొండపోచమ్మ ఆలయంలో భక్తుల క్యూ

భక్తి పారవశ్యం

కొమురవెల్లి/జగదేవ్‌పూర్/ పాపన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం సెలవు కావడంతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి, ఏడుపాయల వన దుర్గామాత, జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న కొండపోచమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు.




కొండపోచమ్మ అమ్మవారు



చేర్యాలలో వినాయకుడికి నివేదించిన 151 రకాల నైవేద్యాలు

మహా గణపతిం.. మనసాస్మరామి

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 31: వినాయక మండపాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. అయోధ్యరాముడు, బాలగణపతి, అయ్యప్ప, లంబోదరుడు, శ్రీరాముడు, శివాజీ తదితర రూపాల్లో గణపతులను కొలవుదీరారు. ఆదివారం ఐదో రోజు కావడంతో హోమాలు, కుంకుమ పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జోరుగా సాగాయి. రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో గణపయ్యను ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. దుబ్బాకలో రాత్రి చక్రాలబండిపై చిన్నారులు వినాయక శోభాయాత్ర నిర్వహించారు. చేర్యాలలో 151 రకాలు, దుబ్బాకలోని కేదారేశ్వరాలయంలో 56 రకాల నైవేద్యాలను సమర్పించారు. కొండపాక మండల కేంద్రంలో జాగృతి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఐఏఎస్ అఖిల్ ప్రత్యేక పూజలు చేశారు.



దుబ్బాకలో 56 నైవేద్యాలు..



మెదక్‌లో త్రిముఖ గజాననాపై..



ఫతేనగర్‌లో అయ్యప్పస్వామి ఆకృతిలో గణనాథుడు



కల్హేర్‌లోని డీఎస్ కాలనీలో అయోధ్య బాలరాముడి రూపంలో..

గ్రామస్థులంతా ఏకమై చెరువును కాపాడుకున్నారు



ఖాజీపూర్‌లో చెరువుకు పడిన గండిని పూడ్చుతున్న గ్రామస్థులు

మిరుదొడ్డి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐమత్యంతో ఏదైనా సాధ్యమేనని నిరూపించారు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామస్థులు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఖాజీపూర్ గ్రామంలోని పెద్ద చెరువుకు పెద్ద గండిపడింది. ఈ సమాచారమందుకున్న గ్రామస్థులు వెంటనే స్పందించారు. ఆదివారం ఊరంతా ఏకమై గ్రామంలోని చెరువుకు పడిన గండిని పూడ్చే ప్రయత్నం చేశారు. గత 3 రోజులు కురిసిన వర్షానికి గ్రామంలో పెద్దచెరువు నిండుకుండలా మారింది. చెరువు నిండి అలుగుపారుతున్న దృశ్యం చూడకముందే చెరువుకు గండి పడింది. దీంతో ఎలాగైనా సాగునీటిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ట్రాక్టర్లతో మట్టిని తీసుకుని వచ్చి, ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించి చెరువుకు పడిన గండిని పూడ్చారు. ఒకవేళ చెరువుకు పడిన గండిని పూడ్చకుంటే కట్ట పూర్తిగా తెగిపోయే పరిస్థితి తలెత్తేది. చెరువుకు పడిన గండిని తాత్కాలికంగా పూడ్చినప్పటికీ, తమ కష్టానికి ఫలితం ఉంటుందో లేదో అని స్థానిక రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దచెరువుకు మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతున్నారు.

నిద్రలోనే కార్మికుడి మృతి

పటాన్‌చెరు ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నిద్రలోనే ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిబెంగ రాష్ట్రం బాగిటూం గ్రామానికి చెందిన సునీల్‌యాదవ్ (43) పెద్దకంజర్ల గ్రామంలోని అరబిందో నిర్మాణసంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నిద్రపోయిన అతడు ఎంతకీ లేవలేదు. తోటివారు పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. తోటి కార్మికుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సులో మరిచిన బ్యాగు అప్పగింత



ప్రయాణికురాలికి బ్యాగును అప్పగిస్తున్న దృశ్యం

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన నిర్మల అనే మహిళ తన బ్యాగును బస్సులోనే మరిచిపోయింది. ఆ బ్యాగును గుర్తించిన పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఆమెకు తిరిగి అప్పగించారు. బ్యాగులో 12.5 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు ఉన్నాయి. కోహీర్ ఎస్.ఐ. నరేష్, జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సమాచారం అందించి బస్సు డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడారు. వారు వెంటనే బ్యాగును గుర్తించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, నిర్మలకు తిరిగి ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆర్టీసీ అధికారుల చొరవను బాధితురాలు అభినందించారు.

జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

కొండపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో చిత్తుబొత్తు (జూదం) ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామ శివారులోని పండ్ల తోటలో ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నామని కుకునూరుపల్లి ఎస్.ఐ. శ్రీనివాస్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు (సురేందర్ గౌడ్, సంతోష్) పట్టుబడగా, మిగతా ఐదుగురు పరారయ్యారని, వారి వద్ద నుంచి రూ.700, రూ.50 వేల విలువైన ఆన్‌లైన్ లావాదేవీల రికార్డులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ. తెలిపారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న కిలోన్నర గంజాయిని సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం... కూకట్‌పల్లిలో నివాసముంటున్న అజయ్(23) ఓసారి పాన్‌షాపు నిర్వహణ, మరోమారు ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు. పెద్దఎత్తున డబ్బులు రావడం లేదని ఆలోచించిన అజయ్ గంజాయి విక్రయించడానికి సిద్ధపడ్డాడు. రెండు, మూడుసార్లు మహారాష్ట్ర నుంచి గంజాయి కొని తెచ్చి తెల్లాపూర్‌లోని లేబర్ షెడ్డుల్లోని లేబర్లకు విక్రయించాడు. రెండురోజుల క్రితం మహారాష్ట్ర నుంచి కిలోన్నర గంజాయి తీసుకొచ్చిన అజయ్.. ఆదివారం కూకట్‌పల్లి నుంచి బస్సులో తెల్లాపూర్‌కు వచ్చి గద్దర్ విగ్రహం వద్ద లేబర్ షెడ్లకు వెళ్లేందుకు నిల్చున్నాడు. ముందస్తు సమాచారంతో గద్దర్ సర్కిల్ వద్ద ఎస్ఐ రవీందర్ తన సిబ్బంది నిఘావేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నిందితుడిని రిమాండ్‌కు తరలించారని సీఐ తెలిపారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పు డు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్ష పాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు నగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో నగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

మూసివేత దిశగా..!

- ఆదరణ లేక నిరుపయోగంగా రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల
- కంప్యూటర్లు ఇతర సామాగ్రిని హైదరాబాద్‌కు తరలింపు
- స్కిల్ యూనివర్సిటీ కళాశాలగా మార్చితే ఉపయోగం



కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వంద గల రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) గ్రామీణ పేద విద్యార్థులకు వృత్తి విద్య కోర్సు అందించి వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2012 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి గీతారెడ్డి కృషితో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.12.30 కోట్లు వెచ్చించి కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా వద్ద రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాల నిర్మాణం పూర్తయినంతవరకు వృత్తి విద్య కోర్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించి తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కళాశాల నిర్మాణంలో ఆలస్యమైనప్పటికీ 2017 సంవత్సరంలో కళాశాల నిర్మాణం పూర్తయింది. అదే సంవత్సరం ఆగస్టు 3న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసి పలు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులకు ఈ కళాశాలలో డిగ్రీ తరగతులను నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు కళాశాల మంచిగా కొనసాగినప్పటికీ, కరోనా కారణంగా విద్యార్థులు కళాశాలను విడిచి వెళ్లడంతో నాటి నుంచి నేటి వరకు ప్రవేశాలు తీసుకోవడం లేదు. విద్యార్థులు చేరడం లేదు దీంతో కళాశాల నిరుపయోగంగా మారింది.

ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు

రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు లేక వృథాగా ఉండడం వల్ల 2023 సంవత్సరంలో ఇక్కడ మహాత్మా జ్యోతిబాఫూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలగా ఏర్పాటు చేసి నిరుపేద మహిళ విద్యార్థినులకు వృత్తి విద్య కోర్సు అందించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా జూలై, ఆగస్టు నెలలో హోటల్ మేనేజ్‌మెంట్ ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి జిల్లా స్థాయిలో దరఖాస్తులు స్వీకరించారు. మొదట్లో 20 మంది విద్యార్థినులు దరఖాస్తుల చేసుకున్నారు. వెంటనే తరగతులు ప్రారంభించేందుకు అక్టోబర్ 7న మాజీ మంత్రి హరీశ్‌రావు కావేలి చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాఫూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రారంభించారు. అనంతరం అక్కడ సరైన ఏర్పాట్లు తగిన ఫర్నిచర్ లేకపోవడం, వివిధ కారణాల వల్ల తరగతులను నిర్వహించలేకపోయారు.

ఐదేళ్లుగా నిరుపయోగంగా..

రాజుల సైసా రాళ్లపాలు అన్నట్లు కోహీర్ మండలంలోని రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిస్థితి నెలకొంది. వృత్తివిద్య కోర్సులు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రూ.12.30 కోట్లతో నిర్మించిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వినియోగంలో లేకపోవడం వల్ల ప్రస్తుతం మూసివేత దిశగా ప్రక్రియ జరుగుతున్నది. ఈ కళాశాల వినియోగం లేక ఐదు సంవత్సరాలు గడుస్తుండడం వల్ల కళాశాల ఆవరణ మొత్తం పిచ్చి గడ్డితో దర్శనమిస్తుంది అంతేకాకుండా కళాశాలలోని ఫర్నిచర్ కంప్యూటర్లు పాడవుతుండడం వల్ల శనివారం రాష్ట్ర ఓటర్ మేనేజ్‌మెంట్ కళాశాల డైరెక్టర్ వెంకటరమణ, కోహీర్ తహసీల్దార్ వరప్రసాద్, ఎస్ఐ నరేష్‌లు కళాశాలను సందర్శించి కళాశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌కు తరలించారు.

స్కిల్ యూనివర్సిటీ కళాశాలగా మార్చితే మేలు

కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వద్ద గల హోటల్ మేనేజ్ మెంట్ కళాశాల భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ కళాశాల ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉంటుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించింది. అందులో భాగంగానే ఇక్కడ ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను యూనివర్సిటీ కళాశాలగా మారుస్తే యువతకు మేలు జరుగుతుంది. జహీరాబాద్ ప్రాంతంలో జాతీయ పెట్టుబడులు పాదాక మండలి (నిమ్జ్) రానున్న దృశ్య ఈ కళాశాలలో వృత్తివిద్య కోర్సులు, టెక్నికల్ కోర్సులను స్కిల్ యూనివర్సిటీ ద్వారా నేర్పిస్తే యువతకు లాభం చేకూరుతుంది.

సాగుచేయని ఆకుకూరలతో ఆరోగ్యం

- పోషకాహార నిపుణుడు డా. సలోమి యేసుదాస్



సాగుచేయని ఆకుకూరలతో వండిన వంటలను వడ్డిస్తున్న డీడీఎస్ మహిళా రైతులు

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే సాగు చేయని ఆకుకూరలు తినడం వల్ల వివిధ రకాల వ్యాధులు తగ్గి ఆరోగ్యం లభిస్తుందని పోషకాహార నిపుణుడు డా. సలోమి యేసుదాస్ అన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం అల్గోల్-దిడిగి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకేలో సాగు చేయని ఆకుకూరల పండుగ నిర్వహించారు. సందర్శకులు జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి గ్రామాల్లో డీడీఎస్ జీవవైవిధ్య రైతుల పంటపొలాలను సందర్శించి ఆకుకూరల ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం డీడీఎస్-కేవీకేలో జరిగిన సమావేశంలో డా. సలోమి మాట్లాడుతూ, గ్రామీణ రైతులకు అపారమైన అనుభవం ఉంటుందని, ముఖ్యంగా డీడీఎస్ మహిళా రైతులకు చిరుధాన్యాల సాగు, సాగు చేయని ఆకుకూరలపై పూర్తిస్థాయిలో అనుభవం ఉందని చెప్పారు. సాగు చేయని ఆకుకూరలు సహజంగా లభిస్తాయని, వాటిని వండుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. డీడీఎస్ ఈ అంశంపై ప్రయోగాత్మకంగా కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మీలా మాట్లాడుతూ ఆకుకూరలపై మరింత పరిశోధన జరగాలని అభిప్రాయపడ్డారు. డీడీఎస్ మహిళా రైతులు చంద్రమ్మ తదితరులు మాట్లాడుతూ, సాగు చేయని ఆకుకూరలను ప్రతిరోజు ఆహారంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం 40 రకాల సాగు చేయని ఆకుకూరల వంటకాలను అందరూ ఆరగించి ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు ఐదు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు మొత్తం ఐదు పతకాలు లభించాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. రేస్ వాక్ విభాగంలో గణేష్, జావెలిన్ త్రో విభాగంలో పవర్ నగేష్ బంగారు పతకాలు, హైజంప్‌లో ఉదయ్ కిరణ్, జావెలిన్ త్రోలో సిరిచందన వెండి పతకాలు, జావెలిన్ త్రోలో దాన్య కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఆ క్రీడాకారులను, జిల్లా జట్టు కోచ్ మేనేజర్లు లీలా ఆనంద్, లక్ష్మణ్‌ను డీవైఎస్వో వెంకట నర్సయ్య, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి రవీందర్ రెడ్డి, శిక్షకులు నిశాంక్ గౌడ్, ప్రభాకర్, ప్రేమలత అభినందించారు.

కారు, లారీ ఢీ.. మామాఅల్లుడు దుర్మరణం

- ఐదుగురికి గాయాలు





కారులో ఇరుక్కున్నవారిని బయటకు తీస్తున్న పోలీసులు



వెంకట్ (ఫైల్)

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కారు, లారీ ఢీ.. మామాఅల్లుడు దుర్మరణం చెందారు. పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ పట్టణంలోని ఆనందనగర్ కాలనీకి చెందిన మామ, అల్లుడైన సాయి (20), వెంకట్ (33) కుటుంబ సమేతంగాసంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమానికి దైవదర్శనం కోసం ఆదివారం సాయంత్రం కారులో వెళ్తున్నారు. జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న లారీ వీరి కారును ఢీకొట్టడంతో సాయి, వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేశం బావ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలకు ఎంపికలు

మద్దూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 2 నుంచి 4 వరకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వరదరాజు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలలోపు బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెం. 9989132656ను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

ప్రజల్లోకి మన్‌కీబాత్



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలతో మమేకం అవుతున్నారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మోదీ నిర్వహించిన ఆన్‌లైన్ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని రామచంద్రాపురంలోని ఆయన నివాసంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, అనిల్‌రెడ్డి, కృష్ణమూర్తిచారి, మల్లేష్, రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

మెదక్ అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యల్లో జిల్లా అధికారులు నిమగ్నమైనందున సోమవారం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఇబ్బందుల్లేకుండా నిమజ్జనం

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనం విషయంలో ఆటంకాలు లేకుండా అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు సాకి చెరువులో జలమండలి, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించారు.

సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు



ఫతేనగర్‌లో యువసేన గణేష్ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడు

మెదక్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గత 25 ఏళ్ల క్రితం చిన్న గణపతి ప్రతిమను నెలకొల్పి గణేష్ ఉత్సవాలను ప్రారంభించిన యువనేత గణేష్‌మండలి 25 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా ఈసారి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండలి నిర్వాహకులు గిద్దా తెలిపారు. ప్రతిఏటా సభ్యులు సత్యసాయి మండలి సౌజన్యంతో భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరమని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం టిక్యానాయక్‌తండాకు చెందిన రేణుకకు సీఎం సహాయనిధి దారాఆ మంజూరైన రూ.23 వేలను ఆదివారం అందజేశారు.

'కనీస వేతనం రూ.26 వేలు చేస్తూ ప్రకటన చేయాలి'

పటాన్‌చెరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేయాలని సీఐటియు కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాణిక్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు శ్రామికభవన్‌లో సమావేశం నిర్వహించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా దర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.

'బాధితులను ఆదుకోవాలి'

నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారీ వర్షాలకు కూలిన గృహాల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు అనుముల తుకారం, బేగరి తుకారం, అంబాదాస్, పరశురాం, పండరి కోరారు. మండల పరిధిలోని నాగాపూర్ తండాలో కోలారాములునాయక్ గృహం వెనుకభాగం కూలిపోయింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూలిన గృహాల బాధితులకు పరిహారం అందించి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయాలని కోరారు.

డబుల్ బెడ్‌రూంల వద్ద సౌకర్యాలు కల్పించండి

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల వద్ద అధికారులు, నాయకులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని సీపీఎం నాయకులు మైపాల్ పేర్కొన్నారు. ఆదివారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రమాదకరంగా రాయిపల్లి రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

రాయికోడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధి సిరూర్ గ్రామ శివారులోని మంజీరానదిపై నిర్మించిన రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తిచేసి కాంట్రాక్టర్ కంకర, మొరంవేసి పనులు నిలిపేశాడు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు మీద వేసిన కంకర దిగిపోవడంతో ఆ గుంతల్లో నీళ్లు నిలిచి ఉన్నాయి. అది తెలియని వాహనదారులు అందులోంచి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడే సమయంలో ఈ రోడ్డు మీద ప్రయాణించాలంటే ప్రజలు, వాహనదారులు జంకుతున్నారు. ఈ రోడ్డు గుండా నారాయణఖేడ్, జోగిపేట, మెదక్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు ఉన్నచోట మొరం వేయించి, మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



రాయిపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా రోడ్డు

5 నుంచి దాదా హజత్ ఉర్సు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

పుల్కల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు దాదా హజత్ 80వ ఉర్సు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ ప్రకటనలో తెలిపారు. 80 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు కులమతాలకతీతంగా వేలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుంచి తీసుకొని దర్గాలోకి తీసుకెళ్లి కీలక ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. 6న వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే షై ఫీల్ సమ, అన్నదానం ఉంటుదన్నారు. ముఖ్యఅతిథిగా అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీషా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



భావతరంగాలు పుస్తకం ఎందరికో ప్రేరణ

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పాక రాజమౌళి రచించిన భావ తరంగాలు, భారత భారతి పుస్తకం ఎందరికో ప్రేరణగా నిలిచిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం భావ తరంగాలు భారత భారతి పుస్తకాన్ని ఎంపీ ఆవిష్కరించి మాట్లాడారు. రాజమౌళి లాంటి ప్రజ్ఞావంతులు రచించిన పుస్తకాలు యువతకు స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజయ సారధి, పూర్ణ కృష్ణ, ప్రజ్ఞాభారతి జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పెంటారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పాఠశాల ప్రధానాచార్యులు నర్సింహాగౌడ్, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.



భావ తరంగాలు పుస్తకావిష్కరణలో ఎంపీ రఘునందన్‌రావు

రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలి

- మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల చొప్పున చెల్లించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాపన్నపేట మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో వరదల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా వరదల వల్ల ఇరువురు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. వరదల్లో చిక్కుకొని విద్యుత్ స్తంభాలపై ఉండి నాలుగు గంటల పాటు ఆర్తనాదాలు చేసినా వారిని రాష్ట్ర ప్రభుత్వం రక్షించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హెలికాప్టర్ పంపి ఉంటే వారి ప్రాణాలు దక్కేవన్నారు. పాపన్నపేట మండల పరిధిలోని చాలా గ్రామాల్లో రైతులు పంటలు నష్టపోయారని, అలాగే రోడ్లు, బ్రిడ్జిలు తెగిపోయాయని, ఇంతవరకూ తహసీల్దార్ కానీ, ఏఈలు కానీ, ఇతర అధికారులు కానీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అలాగే ఎల్లాపూర్, ఆరేపల్లి, కుర్తివాడ, మిన్పూర్, ముద్దాపూర్, రామతీర్థం తదితర గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. వీరి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు ఉన్నారు.



పూర్ గ్రామంలో పంట పొలాలు మునిగిన రైతులతో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి, పద్మారెడ్డి

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం : ఏఈ

నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మంజీరాలో ఉధృతంగా వరద నీరు చేరుతున్నందున మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఏఈ తిరుమలా గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగూరులో వరదనీరు భారీగా వస్తున్నందున బోరంచ, పోచారం, గుడూరు సిగ్మెంట్ ప్లాంట్లలో అధికశాతం టర్బోడీటీ వస్తుందని, అందువల్ల డబ్ల్యూటీపీలను నిలిపివేయడం జరిగిందన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా అంతరాయం ఏర్పడుతున్నందున ప్రజలు లోకల్ వాటర్ సోర్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

సాయం చేయండి.. రెచ్చగొట్టకండి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు



నాగ్‌సాన్‌పల్లిలో మాజీ సర్పంచ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హనుమంతరావు

పాపన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వరదల్లో నష్టపోయిన రైతులకు సాయం చేయండి.. కానీ రెచ్చగొట్టకండని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్ నాయకులకు హితబోధ చేశారు. ఆదివారం పాపన్నపేట మండలంలో పర్యటించిన ఆయన కుర్తివాడ గ్రామంలో మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంటలు మునిగిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్యపడొద్దన్నారు. కోతలకు గురైన రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు. దాదాపు పాపన్నపేట మండలంలో 40 శాతం వరి పంట దెబ్బతిని ఉండొచ్చని పేర్కొన్నారు. 50 ఏళ్లలో ఎప్పుడూ కురవని వర్షాలు కురిశాయని, నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో పంటలు నీట మునిగాయని చెప్పారు. అంతకు ముందు నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భూదేమి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుమారుడు ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్ కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

- ఖేడ్ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు అందించిన సేవలే తీపి గుర్తులుగా ఉంటాయని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య అన్నారు. ఖేడ్ డిపోలో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ పొందిన మెకానికల్ ఇంజనీర్ దశరత్‌రావుకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ దశరత్‌రావు ఆర్టీసీలో 32 ఏళ్ల విధులు నిర్వర్తించాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దశరత్ రావు మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్ సుదీర్ఘకాలం చక్కగా సేవలందించడం గొప్ప విషయం అన్నారు.



నర్సాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న దృశ్యం

మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరం

బీహార్‌లో కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరమని బీజేపీ శ్రేణులు ఖండించారు. ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ జాతీయనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

రూ. 4.5 కోట్లతో బ్రిడ్జి ప్రతిపాదన : ఆర్డీవో

తూప్రాన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి సమీపంలో హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే స్థానంలో రూ.4.5 కోట్ల హ్యామ్ నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం దెబ్బతిన్న కాజ్‌వేను ఆయన పరిశీలించారు. హల్దీవాగులో నీటి ప్రవాహం తగ్గడంతో తూప్రాన్-కిష్టాపూర్ మార్గంలో రాకపోకలు ప్రారంభమైనట్లు వివరించారు. కొట్టుకుపోయిన కాజ్‌వే స్థానంలో ఆబోతుపల్లి వద్ద కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాజుల పండుగ



మహిళలకు గాజులు తొడిగిన కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం మద్రి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షురాలు అస్మా ఆధ్వర్యంలో గాజుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు అస్మా గాజులు తొడిగి మాట్లాడారు. గాజులు తొడిగే సంప్రదాయంతో కుటుంబ అనుబంధం పెరుగుతుందన్నారు. మహిళలకు కార్యనిర్వహక బాధ్యతలు అందించడంలో కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అంతే కాకుండా మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంలో కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు రేణుక, సురేఖ, అనుషమ్మ, పద్మ, పెంటమ్మ, శంకరమ్మ, మొగులమ్మ, జయమ్మ, అంజమ్మ, సువర్ణమ్మ, మానెమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం వేళ.. పైలం

(5వ పేజీ తరువాయి)

సహాయం తీసుకోవాలని కూడా సూచించారు.

జాగ్రత్తగా ఉంటేనే మేలు

వినాయక నిమజ్జనాలు ప్రజల భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీక అయినప్పటికీ, భక్తి ఉత్సాహంలో భద్రతను విస్మరించడం ప్రాణాంతకం. అందుకే కుటుంబ సభ్యులు చిన్నారుల పట్ల జాగ్రత్తగా ఉండాలి, మద్యం సేవించి నిమజ్జనానికి వెళ్లకుండా చూడాలి. అధికారులు, పోలీసుల సూచనలు పాటించి, గుంపులుగా కాకుండా క్రమపద్ధతిలో నిమజ్జనాలు జరిపితే ప్రమాదాలను నివారించవచ్చు.

అధికారుల పరిశీలన

కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు నిమజ్జనాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం పాయింట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు, లైటింగ్, క్రేన్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, జనరేటర్లు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి ఘాట్ వద్ద పోలీసు, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లను నియమించాలని ఆయన తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. వినాయక నిమజ్జనాల కోసం పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నాం. నిమజ్జనం పాయింట్ల వద్ద రక్షణ కంచెలు, లైటింగ్, క్రేన్లు, ఏర్పాటు చేస్తున్నాం. గజ ఈతగాళ్లను రప్పిస్తున్నాం. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. నిమజ్జనం పాయింట్ల వద్ద విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతీ ఘాట్ వద్ద పోలీస్, మున్సిపల్ సిబ్బందితో పాటు వలంటీర్లను నియమిస్తున్నాం.

-రాహుల్‌రాజ్, మెదక్ కలెక్టర్

అభివృద్ధికి అడ్రస్.. దామోదర్

- మంత్రిపై మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు చేయడం సరికాదు

మునిపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అందోల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే అది దామోదర్ రాజనర్సింహతోనే సాధ్యమని, అభివృద్ధికి అడ్రస్ అంటేనే దామోదర్ అని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ పాండు స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ శనివారం మంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఆదివారం మండలంలోని బుదేరా చౌరస్తాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లవుతుందని, ఇప్పటివరకు మండలంలో రూ.70 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, ఆ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఇంత జరుగుతున్నా అభివృద్ధి ఎక్కడ జరిగిందంటూ క్రాంతికిరణ్ అనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలో జరిగిందా.. కాంగ్రెస్ హయాంలో జరుగుతుందా.. చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములు, మక్బుద్, శంకరయ్య, రుద్రక్రిష్ణ, రహీం, సంగన్న, నారాయణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయండి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాథోడ్ కోరారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులు సీపీఎస్ నిరసన ప్రదర్శనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ అంతం ఎస్టీయూ పంతం నినాదంతో జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కార్యదర్శి జీవన్‌రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అట్టహాసంగా చదరంగం పోటీలు

కంగ్టి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలో యోగి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న ఈ టోర్నమెంట్ మొత్తం 46 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతకు రూ.10 వేల నగదు, రన్నరప్‌కు రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నారు. గణేష్ ఉత్సవాలతో పాటు ఓపెన్ టూ ఆల్ చదరంగం పోటీలు నిర్వహించడం పట్ల యోగి యూత్ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

పొలంబాట పట్టిన విద్యార్థులు



రంజోల్‌లో పొలాల పరిశీలనలో విద్యార్థులు

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పని అనుభవ కార్యక్రమంలో భాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం పొలం బాట పట్టారు. స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ సహకారంతో రంజోల్‌లోని బాబానగర్, తదితర ప్రాంతాల్లోని పంట పొలాలలను సందర్శించి పంటల వివరాలు తెలుసుకున్నారు. కళాశాల విద్యార్థులు విద్యాసంవత్సరం చివరి సమయంలో ప్రతియేటా వస్తుంటారని ఏఈవో ప్రదీప్‌కుమార్ తెలిపారు.

కూలిన పశువైద్యశాల గోడ

రాయికోడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు మండల కేంద్రమైన రాయికోడ్‌లోని పశువైద్యశాల గోడ కూలి అందులో ఉన్న వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. కొన్నేళ్ల క్రితం నిర్మించిన వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో కొద్దిరోజులుగా వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. రెండురోజులు కురిసిన భారీ వర్షానికి గోడ కూలిపోవడంతో అందులో ఉన్న మందులు, విలువైన వస్తువులన్నీ పాడవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పశువైద్యశాలను వేరేచోటుకు మార్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చిన్నశంకరంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1991-1992 పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.